క్లుప్తంగా

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

ఆలమూరు: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని ఆర్డీఓ పి.శ్రీకర్ అన్నారు. పెనికేరులో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన రైతుల నుంచి వినతులు స్వీకరించారు. పంట కాలువల దుస్థితి గురించి ఆర్డీఓకు స్థానిక రైతులు తెలిపారు. తహసీల్దార్ ప్రకాష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.
మామిడికుదురు: ప్రజల అర్జీలను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని తహసీల్దార్ వైవీ సుబ్రహ్మణ్యం ఆచార్యులు సూచించారు. అప్పనపల్లిలో సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది.
రాజోలు: చింతలపల్లిలో సర్పంచ్ మట్టా ప్రసన్న కుమారి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. అనంతరం తహసీల్దారు ప్రసాద్, డీఎల్‌పీఏ బుచ్చిరాజు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి ఆరు, రేషన్ కార్డుల కోసం 37, పింఛన్లకు 48 అర్జీలు వచ్చాయి.
అయినవిల్లి: తొత్తరమూడి పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ వార జయసావిత్రి అధ్యక్షతన జరిగిన రెవెన్యూ సదస్సుకు తహసీల్దార్ నాగలక్ష్మమ్మ హాజరయ్యారు. ఐదు అర్జీలు వచ్చాయి.

టైగర్ కుంగ్ ఫూ పోటీల్లో ప్రతిభ

రాజోలు: టైగర్ కుంగ్ ఫూ పోటీల్లో బి.సావరం గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బొక్కా పార్థీవ్ ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో నిలిచాడని కోచ్ మట్టా శ్రీను శుక్రవారం తెలిపారు. రతన్ టాటా కప్ సౌత్ ఇండియా టైగర్ కుంగ్ ఫూ చాంపియన్‌షిప్ పోటీలు తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ఈ నెల 22న జరిగాయన్నారు. అండర్-12 నాన్‌చాక్ విభాగంలో పార్థీవ్ ప్రథమ స్థానంలో నిలిచి కప్ సాధించగా ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

2న సైన్స్ ఫెయిర్

రాజోలు: విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించేందుకు మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌ను వచ్చే నెల 2న ఏర్పాటు చేయనున్నట్టు ఎంఈఓ నల్లి మనోహరం తెలిపారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఎంఈఓ సమీక్షించారు. 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు సొంత ఆలోచనలతో రూపొందించిన వ్యక్తిగత, సామూహిక శాస్త్రీయ నమూనాలను సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించవచ్చన్నారు. ఎంఈఓ-2 ప్రసాదరావు, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

ఆలమూరు: స్థానిక ఖండ్రిగపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ జరిగింది. ఉపాధ్యాయుడు పిల్లి రాంబాబు సమకూర్చిన ఈ కిట్లను మండల విద్యా శాఖ అధికారి భమిడిపాటి అప్పాజీ, హెచ్‌ఎం అద్దరి శ్రీనివాస్ చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు.

ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం

ఆలమూరు: చింతలూరు సాగునీటి సంఘం పరిధిలో ప్రతి ఎకరాకు సాగునీటిని అందిస్తామని సంఘ అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక నీటి సంఘం పరిధిలోని చింతలూరు, పినపళ్ల, పెదపళ్ల, సంధిపూడి గ్రామాల్లో పంట కాలువలను స్థానిక సభ్యులతో కలసి ఆయన పరిశీలించారు.

రోగాలు వస్తున్నాయని ఫిర్యాదు

అయినవిల్లి: ముక్తేశ్వరం మార్కెట్‌లో కోడి, కుళ్లిన కూరగాయల వ్యర్థాలు వేయడం వల్ల రోగాల బారిన పడుతున్నామని ఎంపీడీఓ జి.భీమారావుకు పలువురు శుక్రవారం ఫిర్యాదు చేశారు. దీనిపై తగు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి కొత్తపేటకు చెందిన చిర్రావూరి సత్యనారాయణ మూర్తి, శోభ దంపతులు శుక్రవారం రూ.10,116 విరాళంగా సమర్పించారు.

ఉపకార వేతనాలకు నిర్ణయం

రాజోలు: ప్రతిభ గల నిరుపేద కాపు విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించేందుకు రాజోలు తాలూకా తెలగా ఉద్యోగుల సంక్షేమ సంఘం నిర్ణయించింది. శుక్రవారం శివకోడు కాపు కల్యాణ మండపంలో సంఘ అధ్యక్షుడు పిండి సత్య నాగవరప్రసాద్ అధ్యక్షతన సమావేశం జరిగింది. వచ్చే నెల 19న శివకోడు కాపు కల్యాణ మండపంలో జరిగే కార్యక్రమంలో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరం నుంచి పీజీ వరకూ 80 శాతం మార్కులు సాధించిన కాపు విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తామన్నారు.

ఉచిత కంటి పరీక్షలు

అంబాజీపేట: పుల్లేటికుర్రులో గుండాబత్తుల సర్వారాయుడు, రవికిశోర్ ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తపేట గౌతమి నేత్రాలయం ఆధ్వర్యంలో 234 మందికి ఉచితం కంటి పరీక్షలు చేశారు.
రావులపాలెం: స్థానిక కోస్టల్ బ్యాంక్ 25వ రజతోత్సవం సందర్భంగా శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బ్యాంకు వద్ద నిర్వహించిన ఈ శిబిరంలో జనరల్ సర్జన్ కర్రి బలరామిరెడ్డి, ఆర్థోపెడిక్ సర్జన్ కర్రి సందీప్‌రెడ్డి వైద్య సేవలు అందించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

అయినవిల్లి: శానపల్లిలంకకు చెందిన యల్లమిల్లి శ్రీనివాస్ కుమార్ (52) తొత్తరమూడిలోని కొండవాటివారిలంకలో ఓ కూరగాయల దుకాణంలో పనిచేస్తున్నాడు. శుక్రవారం కూరగాయల షాపునకు వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికీ రాకపోవడంతో షాపు యజమానిని కుటుంబ సభ్యులు ఆరా తీస్తే రాలేదని చెప్పారు. అతని ఆచూకీ కోసం వెతకగా కొండవాటివారిలంకలో కాలువ వద్ద ఓ చోట సైకిల్, చెప్పులు ఉన్నాయి. అతని బంధువు యల్లమిల్లి ప్రసాద్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మనోహర్‌జోషి తెలిపారు.

తిరుగుబాటు మొదలు..

- కరెంట్ చార్జీల పెంపుపై నిరసనల సెగ
- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కదలిన జనం
- భారీగా ర్యాలీలు, ప్రదర్శనలు

తాము అధికారంలోకి వస్తే అంత చేస్తాం.. ఇంత చేస్తామని ఎన్నికల ముందు కూటమి పార్టీ నేతలు ఊకదంపుడు ప్రసంగాలతో ఊదరగొట్టారు. తీరా అధికారం ఇస్తే మొండిచేయి చూపుతున్నారు.. రైతుల నుంచి అన్నివర్గాల వారికి కష్టాలు మిగిల్చారు. ఇది సరిపోదన్నట్టు సామాన్యుల నడ్డి విరిచేలా విద్యుత్తు చార్జీల భారం మోపారు. అసలే కుటుంబ పోషణకు అల్లాడుతున్న ప్రజలు తిరుగుబాటు మొదలుపెట్టారు. వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు విద్యుత్ చార్జీల దోపిడీకి నిరసనగా శుక్రవారం ఆయా నియోజకవర్గాల్లో ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించారు.




మలికిపురంలో సబ్ స్టేషన్ వద్ద ఏఈ బొలిశెట్టి ప్రసాద్‌కు వినతి పత్రం ఇస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు


పి.గన్నవరం సబ్ స్టేషన్ వద్ద ఏఈకి వినతిపత్రం సమర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు తదితరులు

మలికిపురం: కూటమి ప్రభుత్వంపై తిరుగుబాటు మొదలైందని, ముఖ్యమంత్రి చంద్రబాబు మోసకారి అని మాజీ మంత్రి, రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గొల్లపల్లి సూర్యారావు అన్నారు. విద్యుత్ చార్జీల దోపిడీకి నిరసనగా వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు శుక్రవారం మలికిపురంలో పార్టీ శ్రేణులు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. మలికిపురం కూడలి నుంచి విద్యుత్ సబ్ స్టేషన్ వరకూ మోటార్ సైకిళ్ల ర్యాలీ సాగింది. అనంతరం గొల్లపల్లి కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ గడిచిన ఆరు నెలల కూటమి పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలపై రూ.6,730 కోట్ల విద్యుత్ చార్జీలను అదనంగా వసూలు చేశారన్నారు. వచ్చే జనవరి నాటికి ఈ భారం రూ.15 వేల కోట్లకు పెరగనుందన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలపై ఏమాత్రం భారం లేకుండా పాలన సాగించారన్నారు. సీఎం చంద్రబాబు గత ఎన్నికల ముందు బూటకపు వాగ్దానాలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని గొల్లపల్లి అన్నారు. విద్యుత్ చార్జీలు తగ్గిస్తాన్న బాబు హామీ ఏమైందని నిలదీశారు. అధికారంలోకి వచ్చాక చంద్రబాబు ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రజా పోరాటం ఆరంభం మాత్రమేనని అన్నారు. నెడ్‌క్యాప్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పాటి శివకుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా గ్రీవెన్స్ విభాగం అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్య, వైస్ ఎంపీపీ రుద్రరాజు చిన్నరాజా, మండల శాఖల అధ్యక్షులు కట్టా శ్రీనివాసరావు, కుసుమ చంద్రశేఖర్, ఏఎంసీ మాజీ చైర్మన్లు గుబ్బల రోజా రమణి, గెద్దాడ సత్యనారాయణ, ఎస్తేరు రాణి, దొంగ ఏసు, చెల్లుబోయిన బుచ్చియ్య మాష్టారు, కూనపరెడ్డి రాంబాబు, కందుల విజయ కుమార్, గుండుమేను నారాయణమూర్తి, ఇందుకూరి పిప్పరరాజు, తాడి సహదేవ్ పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం విద్యుత్ శాఖ ఏఈ బొలిశెట్టి ప్రసాద్‌కు వినతి అందించారు.

పి.గన్నవరం: విద్యుత్ చార్జీలు పెంచేదిలేదని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆరు నెలల తిరగకుండానే రూ.15 వేల కోట్లకు పైగా ప్రజలపై భారం మోపుతుందని జిల్లా పరిషత్ చైర్మన్, పి.గన్నవరం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు విమర్శించారు. పి.గన్నవరంలో విప్పర్తి ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మెయిన్ రోడ్డు నుంచి విద్యుత్ సబ్ స్టేషన్ వరకూ పెద్ద ఎత్తున ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా వేణుగోపాలరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, రాష్ట్ర నాయకుడు నేలపూడి స్టాలిన్ బాబు, మండపాటి కిరణ్‌కుమార్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యులు గన్నవరపు శ్రీనివాస్, బూడిద వరలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చంద్రబాబు ప్రజలను మోసగించారని, విద్యుత్ చార్జీలను పెంచి పేదల నడ్డి విరుస్తున్నారని అన్నారు. ప్లకార్డులతో పార్టీ శ్రేణులు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఏఈ జి.వెంకటాచార్యులుకు వినతిపత్రం అందజేశారు. మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, కుడుపూడి విద్యాసాగర్, కొమ్ముల రాము, విత్తనాల ఇంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, దొమ్మేటి వెంకట శివరామన్, పేరి శ్రీను, మద్దుల వరలక్ష్మి, నీతిపూడి గణేష్‌బాబు, గుత్తుల నాగబాబు, మట్టపర్తి పండు, సాధనాల రమేష్, మండల జేసీఎస్ కన్వీనర్లు దొమ్మేటి దుర్గారావు, సత్యమోహన్ పాల్గొన్నారు.

అయినవిల్లి: పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కుడిపూడి విద్యాసాగర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ర్యాలీగా తరలివెళ్లారు. జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, నాయకుడు మట్టపర్తి వెంకటరమణ తదితరులు పి.గన్నవరం విద్యుత్ సబ్ స్టేషన్ వద్దకు వెళ్లి నిరసనలో పాల్గొన్నారు. నాయకులు వాసంశెట్టి తాతాజీ, కనుమూరి సత్యనారాయణరాజు, నేదునూరు సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, బొంతు శ్రీను, పినిపే బుజ్జి ఉన్నారు.

నిరసన ప్రదర్శనకు తరలిన శ్రేణులు


అంబాజీపేటలో వైఎస్సార్ సీపీ నేతల నిరసన

అంబాజీపేట: పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా పి.గన్నవరంలో చేపట్టిన నిరసన ప్రదర్శనకు అంబాజీపేట నుంచి భారీగా వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలి వెళ్లారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో పి.గన్నవరానికి ర్యాలీగా వెళ్లారు. ర్యాలీలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేలపూడి స్టాలిన్‌బాబు, సొసైటీ మాజీ అధ్యక్షులు దొమ్మేటి సత్యమోహన్, కొర్లపాటి కోటబాబు, పార్టీ నేతలు ఎంఎం శెట్టి, పేరి శ్రీనివాసరావు, మైలా ఆనందరావు, ముత్తాబత్తుల ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

బాబు చెప్పేదొకటి.. చేసేదొకటి

మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ధ్వజం


రావులపాలెం నుంచి కొత్తపేట వరకూ బైక్ ర్యాలీగా వెళుతున్న మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి


కొత్తపేటలో ఏడీఈకి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తదితరులు

కొత్తపేట/రావులపాలెం: ఎన్నికల ముందు చంద్రబాబు చెప్పిందొకటి, ఇప్పుడు చేసేది మరొకటని.. ప్రజలపై భారం వేయడమే అతని విధానమని కొత్తపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి విమర్శించారు. కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా ఆయన ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో రావులపాలెం పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. తొలుత రావులపాలెం సెంటర్‌లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిర్ల సోమసుందర రెడ్డి విగ్రహాలకు జగ్గిరెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అక్కడి నుంచి కొత్తపేట పాత బస్టాండ్ వరకూ మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. అప్పటికే అక్కడికి చేరుకున్న కొత్తపేట మండల పార్టీ శ్రేణులతో విద్యుత్ బల్బులు, ప్లకార్డులు చేతబట్టి స్థానిక ఎలక్ట్రికల్ ఏడీఈ కార్యాలయం వరకూ పాదయాత్రగా వెళ్లారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు అనేక వాగ్దానాలు ఇచ్చి తీరా అధికారం చేపట్టి ఆరు నెలలు గడవకుండానే వివిధ రూపాల్లో అదనపు భారం వడ్డిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజల నుంచి భారీగా రుసుం వసూలు చేస్తున్నారన్నారు. సంపద సృష్టించడం అంటే కరెంటు బిల్లు పెంచడమా, లేక రిజిస్ట్రేషన్ల చార్జీలు పెంచడమా అని ప్రశ్నించారు. ప్రజలపై అదనపు యూజర్ చార్జీల భారం లేకుండా చేయాలన్నారు. గత ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్లను ఉచితంగా ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. బిల్లులు కట్టలేక ఒక ఎస్సీ యువకుడు ఆత్మహత్య చేసుకునేలా చేసిన ఘనత ఇప్పటి చంద్రబాబు ప్రభుత్వానిదని అన్నారు. అనంతరం ఏడీఈ డి.చిట్టిరాజుకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అమ్ముడా మాజీ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్ రాజు, ఎంపీపీ మార్గాన గంగాధర్‌రావు, జెడ్పీటీసీ సభ్యులు గూడపాటి రమాదేవి, కుడిపూడి శ్రీనివాసరావు, బోణం సాయిబాబు, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు కప్పల శ్రీధర్, మండల పార్టీ అధ్యక్షులు ముత్యాల వీరభద్రరావు, దొమ్మేటి అర్జునరావు, తమ్మన శ్రీను, డీసీసీబీ మాజీ డైరెక్టర్ చిలువూరి రామకృష్ణంరాజు, రాష్ట్ర పార్టీ మాజీ ప్రచార కార్యదర్శి ముసునూరి వెంకటేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు సాకా ప్రసన్నకుమార్, బొక్కా వెంకటలక్ష్మి, జిల్లా ఎస్టీ విభాగం అధ్యక్షుడు కుర్రా శ్రీను, సర్పంచులు రెడ్డి చంటి, సాగి బంగార్రాజు, అంబటి సుబ్బలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు పేపకాయల బ్రహ్మానందం, విల్లా వీర్రాజు, ముళ్ల జనార్దన్‌రావు, పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జ్ మట్టపర్తి వెంకట్రావు, గ్రామ శాఖల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక


సఖినేటిపల్లి లూథరన్ ఉన్నత పాఠశాలలో సత్కారం అందుకున్న గురువులతో పూర్వ విద్యార్థులు

సఖినేటిపల్లి: అరే బాగున్నావా... ఎంత మారిపోయావురా.. ఎంత కాలమైంది నినుచూసి.. అంటూ కుశల ప్రశ్నల మధ్య పూర్వ విద్యార్థుల సమ్మేళనం సాగింది. స్థానిక లూథరన్ ఉన్నత పాఠశాలలో 2002-03 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు శుక్రవారం ఆ పాఠశాలలోనే కలుసుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా సుమారు 21 ఏళ్ల అనంతరం కలుసుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఎవరు ఏ హోదాల్లో ఎక్కడెక్కడ స్థిరపడ్డారో ఒకరికొకరు పరిచయం చేసుకున్నారు. తొలుత పూర్వ విద్యార్థులు ప్రముఖులకు, గురువులకు స్వాగతం పలికారు. తమకు తరగతి గదుల్లో పాఠాలు నేర్పిన గురువులు స్కూల్ కరస్పాండెంట్, డ్రాయింగ్ టీచర్ నల్లి ప్రేమానందం, జాన్ మోజెస్, మార్టిన్, విజయరత్నంలను ఘనంగా సత్కరించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం గెద్దం రమేష్‌బాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. రెవ బి.పీటర్‌సన్, స్కూల్ స్టాఫ్ దొండపాటి సువర్ణరత్నం, సాల్మన్, నాగమణి, నిర్మల, శ్రావణ్ కుమార్, రమేష్, విజయేంద్రనాథ్, బాలకృష్ణ, మురళీకృష్ణ, మెర్సీ, స్రవంతి, చిట్టికుమారి పాల్గొన్నారు.

గొప్ప ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్


కొత్తపేటలో మన్మోహన్ సింగ్ మృతికి మౌనం పాటిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి


మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రాలను చూపుతున్న విద్యార్థినులు

కొత్తపేట/రావులపాలెం: దేశ ఆర్థికవేత్తల్లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అగ్రగణ్యుడని మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మాజీ ప్రధాని మృతికి శుక్రవారం కొత్తపేటలో జరిగిన ఒక కార్యక్రమంలో జగ్గిరెడ్డి వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్మోహన్ ప్రధాన మంత్రిగా ఎన్నో ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చి దేశంపై చెరగని ముద్ర వేశారన్నారు. అమ్ముడా మాజీ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గాన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యులు గూడపాటి రమాదేవి, కుడిపూడి శ్రీనివాసరావు, బోణం సాయిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు పాల్గొన్నారు.
కొత్తపేట: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రాజు ఆధ్వర్యంలో సంతాప కార్యక్రమం నిర్వహించారు.
పి.గన్నవరం: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సంతాపం వ్యక్తం చేశారు.
మామిడికుదురు: ఆర్థిక రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకు వచ్చిన నిపుణుడు డాక్టర్ మన్మోహన్ సింగ్ అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు అన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి పి.గన్నవరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద నివాళులర్పించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షులు అప్పన శ్రీరామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పీసీసీ సభ్యులు మహ్మద్ ఆరిఫ్, నేతలు మాచవరం శివన్నారాయణ పాల్గొన్నారు.
మలికిపురం: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటని పీసీసీ సభ్యుడు రుద్రరాజు గోపాలకృష్ణరాజు అన్నారు. లక్కవరం జరిగిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ మాజీ కో ఆర్డినేటర్ చిలకపాటి శ్రీధర్, కూనపరెడ్డి కృష్ణ, అప్పారి శ్రీనివాస్, గునిశెట్టి ప్రసాద్, పిచ్చుక దుర్గాప్రసాద్, బొలిగర్ల మనోజ్, మండపాటి రామకృష్ణ పాల్గొన్నారు.
అంబాజీపేట: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి పీసీసీ సభ్యుడు ములపర్తి మోహనరావు సంతాపం తెలిపారు. ఈ మేరకు స్థానికంగా సభ జరిగింది.

చిత్ర నీరాజనం

మామిడికుదురు: దేశాన్ని అన్ని రంగాల్లో అగ్రపథంలో నడిపిన మాజీ ప్రధాని స్వర్గీయ మన్మోహన్‌సింగ్‌కు ఈదరాడ విద్యార్థులు శుక్రవారం చిత్ర నీరాజనం పలికారు. పదో తరగతి విద్యార్థులు దిద్దుం అలేఖ్య స్ఫూర్తి, యెరుబండి గౌరీ నాగమణి కార్తిని పెన్సిల్‌తో మన్మోహన్‌సింగ్ చిత్రాలు గీశారు.

పారిశుధ్య చర్యలు పాటించాలి

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందుందుకు చర్యలు తీసుకోవాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.మల్లికార్జున, పి.భవానీశంకర్ కోరారు. డ్రైడే ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నిల్వ నీరు ఉండకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

వైభవంగా నారసింహుని కల్యాణం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శుక్రవారం ఆర్జిత సేవగా స్వామివారి శాంతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణం జరిపారు.

హడలెత్తించిన పాము

అంబాజీపేట: అంబాజీపేటలోని నూకపెయ్యి కృష్ణవంశీ ఇంట్లో శుక్రవారం ఓ పాము హడలెత్తించింది. ఆ సమాచారాన్ని స్నేక్ క్యాచర్ గణేష్ వర్మకు అందించడంతో అతను వచ్చి పామును బంధించారు. దానిని దూరంగా తీసుకువెళ్లి జన సంచారం లేని ప్రాంతంలో విడిచిపెట్టారు.